క్లుప్తంగా

సాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



పూడికతీత పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక: అరబుపాలెంలో సాగునీటి కాలువలో పేరుకుపోయిన పూడికను శుక్రవారం తొలగించారు. ఈ పనులను పరిశీలించిన సర్పంచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించినట్టు తెలిపారు.

ఇందిరమ్మ కాలనీలో రహదారి పరిశీలన



మునగపాక ఇందిరమ్మ కాలనీలో పర్యటిస్తున్న ఆర్అండ్‌బీ ఏఈ నీలిమ

మునగపాక: స్థానిక ఇందిరమ్మ కాలనీలో రహదారిని ఆర్అండ్‌బీ ఏఈ నీలిమ పరిశీలించారు. కాలనీకి చెందిన కొంతమంది ఇటీవల స్పందనలో రహదారి మెరుగుకు నిధులు మంజూరు చేయాలని అర్జీ అందజేశారు.ఈ మేరకు ఆమె కాలనీలో పర్యటించి రహదారి పరిస్థితి గురించి తెలుసుకున్నారు. వర్షాకాలంలో తాము పడుతున్న ఇబ్బందులను స్థానికులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. కాలనీ అధ్యక్షుడు ఆడారి వెంకటప్పారావు, కాలనీ వాసులు కొణతాల సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి



గంగాదేవిపేటలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న మూలపేట ఉప సర్పంచ్ దేవీ చంద్ర

మునగపాక: ఈ సీజన్‌లో ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని వైద్యాధికారి యామిని సూచించారు. మండలంలోని గంగాదేవిపేటలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ఇందుకోసం తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాజా ఆహారంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారం శ్రేయస్కరమన్నారు. ఈ శిబిరాన్ని మూలపేట ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రమణి,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



విద్యార్థినిని అభినందిస్తున్న శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అధినేత నరసింహారావు

పాయకరావుపేట: స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాలలో బీకాం చదివిన పి.సాయి వాణి ఆంధ్రాయూనివర్సిటీ పరిధిలో 9.04 గ్రేడ్ పాయింట్ పొంది, ద్వితీయ ర్యాంకు సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీర్రాజు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధినేత నరసింహారావు విద్యార్థినిని అభినందిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ సీహెచ్ విజయ్‌ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మెయిన్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

పాయకరావుపేట: పట్టణంలోని మెయిన్‌రోడ్డు నిర్మాణానికి శనివారం అనకాపల్లి ఎంపీ బి.వి. సత్యవతి, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు శంకుస్థాపన చేయనున్నట్టు ఎంపీడీవో ఎ.సాంబశివరావు తెలిపారు. వీఎంఆర్‌డీఏ నిధులు రూ.1.90 కోట్లతో 1.9 కిలో మీటర్ల రోడ్డును నిర్మించనున్నట్టు చెప్పారు. మధ్యాహ్నం 2 గంటలకు గౌతమ్ థియేటర్ సెంటరు వద్ద శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు.

అమర వీరులు.. నిత్య స్మరణీయులు



గొల్లలపాలెంలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



రామగిరిలో మొక్క నాటుతున్న వైస్ ఎంపీపీ లక్ష్మి



చినబొడ్డేపల్లిలో అమరవీరులకు వందనం చేస్తున్న అధికారులు, నాయకులు



మాజీ సైనికుడు అచ్చియ్యను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి

యలమంచిలి: స్వాతంత్ర్య సమరయోధుల త్యాగం స్ఫూర్తిదాయకమని, వారిని నిత్యం స్మరించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. మేరా మిట్టీ- మేరాదేశ్ (నా భూమి, నాదేశం) కార్యక్రమంలో భాగంగా స్థానిక స్టేషన్ రోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి మొక్కలు నాటి, దేశ నాయకుల ఆజాదికా అమృత్ మహోత్సవ్ స్థూపం ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు దేశ భక్తి గీతాలు ఆలపించి, ప్రతిజ్ఞ చేశారు. మట్టి ప్రమిదలతో నేల తల్లికి దీపారాధన చేశారు. ఈ సందర్భంగా రమాకుమారి మాట్లాడుతూ క్రమశిక్షణతో లక్ష్యాన్ని సాధించవచ్చని, అవినీతి లేని సమాజంతోనే స్వాతంత్ర్యానికి పూర్తి అర్హత వస్తుందన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో పాటు దేశభక్తిని అలవర్చుకోవాలన్నారు. ఈ రెండూ ఉంటే విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోగలరని తెలిపారు. ప్రతి ఒక్కరూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన నాయకులు, సైనికులను నిత్యం స్మరించుకోవాలని తెలిపారు. యలమంచిలి పట్టణానికి చెందిన మాజీ సైనికుడు కొప్పిశెట్టి అచ్చన్నను మున్సిపల్ చైర్‌పర్సన్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అచ్చన్న మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్త, మున్సిపల్ కమిషనర్ కె. వీరయ్య, తహసీల్దారు రాణీ అమ్మాజీ పాల్గొన్నారు.

యలమంచిలి: ప్రతి ఒక్కరూ దేశ భక్తిని అలవర్చుకోవాలని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. మండలంలో జంపపాలెం, తురంగలపాలెం, రుక్మిణీపురం గ్రామాల్లో నిర్వహించిన నాభూమి-నాదేశం కార్యక్రమాల్లో ఆయన స్వాతంత్ర్య సమరయోధులకు స్థూపాలను ఆవిష్కరించి, మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగం వల్లే మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పలనాయుడు,యలమంచిలి రూరల్ ఎస్ఐ సన్నిబాబు, ఎంఈవో అరుణ్‌కుమార్, ఏఈ సోమశేఖర్,వెలుగు ఏపీఎం రాణీ,ఆర్‌డబ్ల్యూ ఏఈమానస, మాజీ సర్పంచ్‌లు యల్లపు శ్రీరాములు,తోకల రాజు,చందక శాంతి,భీముని అప్పారావు, మరిసా అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కాళ్ల సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

మునగపాక: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు బోజా లక్ష్మి కోరారు. నా భూమి-నా దేశం కార్యక్రమంలో భాగంగా ఆమె మండలంలోని రామగిరిలో అమరవీరుల శిలాఫలకం వద్ద నిర్వహించిన వందనం కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మొక్కలు నాటారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతోమంది తమ ప్రాణాలను ఫణంగా పెట్టారన్నారు. వారిని గుర్తుంచుకునేందుకు చేపట్టిన వందనం కార్యక్రమం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు బోజా శ్రీనివాసరావు,పల్లా రాజు తదితరులు పాల్గొన్నారు. గొల్లలపాలెంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు శీరా రమణమ్మ,వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజుల ఆధ్వర్యంలో అమరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: నా భూమి, నా దేశం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సత్యవరంలో అమర వీరుల శిలాఫలకం ఆవిష్కరించారు. వారి సేవలను స్మరించుకుంటూ వందనం సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సకిలేటి రాము, ఎంపీడీవో ఎ.సాంబశివరావు, ఎస్ఐ ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల: మహనీయులను స్మరించుకుంటూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడడం చాలా సంతోషకర విషయమని సర్పంచు పైల శివరామ్ అన్నారు. పాములవాక, పి.కె.పల్లి, చినబొడ్డేపల్లి, రామన్నపాలెం, ఆక్సాహేబుపేట, తంగేడు గ్రామాలలో నాభూమి-నాదేశం కార్యక్రమం నిర్వహించారు. చినబొడ్డేపల్లిలో సచివాలయం వద్ద మహనీయులను స్మరించుకుంటూ జాతీయ పతాకానికి వందనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు పాల్గొన్నారు. తంగేడులో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు లక్ష్మీనరసింహరాజు, ఈవోపీఆర్డీ సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం నా భూమి - నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాజీపాలెంలో అమరవీరులకు నివాళులు అర్పించారు.జగ్గన్నపేటలోనిర్వహించిన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌లు,ప్రజా ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

రాంబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో నా భూమి- నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ జి. శిరీష శ్రీనుబాబు, ఎంపీడీవో కె.ఎస్. కొండలరావు శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు ఆదర్శప్రాయమన్నారు. పర్యావరణ పరిరక్షణకు అవసరమైన మొక్కలను నాటడమే గాక వాటిని సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి పథకం ఏపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తంగేడులో మహనీయులను స్మరించుకుంటున్న నాయకులు



జగ్గన్నపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న స్థానికులు



రాంబిల్లిలో మొక్కలు నాటుతున్న నాయకులు



తురంగలపాలెంలో నాభూమి -నాదేశం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ బోదెపు గోవింద్



సత్యవరంలో అమరవీరుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు

ఎండలతో కూలీలు విలవిల

రాంబిల్లి: వరినాట్ల పనుల్లో ఉన్న రైతులు, కూలీలు ఎండల తీవ్రతకు ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజులుగా ఎండలు ఎక్కువగా ఉన్నాయి. నీరు వేడెక్కిపోవడంతో వ్యయసాయ పనుల్లో పాల్గొన్న కూలీలు అల్లాడిపోతున్నారు. కొన్ని వరినారుమడులుఎండిపోతున్నాయనిరైతులు తెలిపారు.

బ్లాక్‌లో టికెట్ల విక్రయంపై ఫిర్యాదు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని సినిమా థియేటర్ వద్ద బ్లాక్‌లో టికెట్లు అమ్ముతూ, యాజమాన్యం తరపున ఓ వ్యక్తి దందా చేస్తున్నాడని పూడిమడకకు చెందిన ఎరిపల్లి కాసులు అనే వ్యక్తి తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. థియేటర్‌లో తినుబండారాలు ధరలు నియంత్రించాలని కోరాడు.

నేడు కుసుమ హరనాథ్ ఆలయంలో భజనలు

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం కోటవీధిలోని కుసుమ హరనాథ్ దేవాలయంలో శనివారం ఉదయం 5 నుంచి సాయంత్రం 6 వరకూ 44వ చాతుర్మాస దీక్ష సందర్భంగా భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దేవాలయం ప్రచార కార్యదర్శి ఎన్.ఉమామహేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భజన కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

ఢీకొన్న ఆర్టీసీ బస్సు, లారీ



కశింకోట పోలీస్ క్వార్టర్స్ వద్ద ప్రమాదంలో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

కశింకోట: స్థానిక పోలీస్‌క్వార్టర్స్ వద్ద శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ బస్సుకు పెద్ద ప్ర మాదం తప్పింది. యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు, అదే మా ర్గంలో వస్తున్న లారీ పక్కగా ఢీకొన్నాయి. ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు. బస్సు పక్క, ముందు భాగాలు దెబ్బతిన్నాయి. దీనిపై ఇంకా తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం



ఉపముఖ్య మంత్రి బూడి ముత్యాల నాయుడును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

ఎస్.రాయవరం: ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామాల్లో మరింత విస్తృతంగా ప్రచారం చేయాలని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు మండలానికి వచ్చిన ఆయనకు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికి, అడ్డురోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మరింత ప్రచారం చేయాలని, దీనిపై కార్యకర్తలు మళ్లీ దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారి బొలిశెట్టి గోవిందు, జెడ్పీటీసీ కాకర దేవి, ఎంపీపీ కోన లోవలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, సర్పంచ్‌లు దూళి శ్రీనుబాబు,పాలపర్తి పాపారావు,ఎంపీటీసీలు బాలం సూరిబాబు, బైపా శ్రీనివాసరావు పాల్గొన్నారు.


అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు



బదిలీపై వెళ్లిన హెచ్ఎం శ్రీదేవిని సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని ఎంఈవో వేణుగోపాలరావు అన్నారు.మండలంలోని టి.సిరసపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా పనిచేసి బదిలీపై వెళ్లిన శ్రీదేవికి శుక్రవారం పాఠశాల ఆవరణలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదన్నారు. సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి నాగప్పారావు,ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు,పీఎంసీ చైర్మన్ బొడ్డేడ వీరలక్ష్మి,హెచ్ఎం మల్లేశ్వరరావు,గ్రామస్తులు నాయుడు అప్పలనాయుడు, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వరినాట్లు



వరినాట్లు వేస్తున్న కూలీలు

కోటవురట్ల: వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. రైతులు హుషారుగా పనుల్లో పాల్గొంటూ వరి నాట్లు వేస్తున్నారు. నారు ఏపుగా ఎదగడంతో అన్నదాతల్లో మరింత జోష్ కనిపిస్తోంది. ప్రస్తుతం మండలంలో ఎక్కడ చూసినా వరి నాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ ఏడాది 1,680 హెక్టార్లలో వరి సాగు లక్ష్యంగా వ్యవసాయాధికారులు రైతులను ప్రోత్సహిస్తున్నారు. జల్లూరు, యండపల్లి, అన్నవరం, బి.కె.పల్లి, కోటవురట్ల, కైలాసపట్నం, రాజుపేట, రామచంద్రపురం, గొట్టివాడ ప్రాంతాలలో వరినాట్లు వేస్తున్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట: గ్రామాల్లో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలోని గుంటపల్లి గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరుపై ఆరా తీశారు. సంక్షేమ పథకాలు అందని అర్హులుంటే గ్రామ వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాబూరావు మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు సరఫరా జరుగుతుందన్నారు. అర్హులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు ఇంటి నిర్మాణానికి రుణాలు మంజూరు చేస్తోందని చెప్పారు. అనంతరం సంక్షేమ పథకాల బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, ఎంపీటీసీలు పల్యేల శ్రీరామవరలక్ష్మి, లక్ష్మణరావు, గూటూరు రామగోవిందు, మండల కోఆప్షన్ సభ్యుడు కాదా రామకృష్ణ, పార్టీ నాయకులు జగతా శ్రీను, దోమాడ సుందరరావు, బొడ్డా శ్రీదేవి, కేశనకుర్తి సత్తిబాబు, ఎంపీడీవో ఎ.సాంబశివరావు పాల్గొన్నారు.

ఓటరు సర్వేపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు

మునగపాక: ఓటరు సర్వేపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు కోరారు. మునగపాకలోని బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో పార్టీ ప్రజా ప్రతినిధులు,బీఎల్ఏలతో ఆయన సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా చూడాలన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు,పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు,ఎంపీటీసీ సూరిశెట్టి రాము, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశిబాబు,సచివాలయ కన్వీనర్‌లు బొడ్డేడ మహేష్,బొడ్డేడ అప్పలనాయుడు,పార్టీ నాయకులు వేగి కృష్ణ, ఆడారి సంతోష్‌కుమార్.శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న నాయకులు

మునగపాక: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని ప్రముఖ సైకాలజిస్టు జె.ఎస్.వి.రావు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తోసా(తిమ్మరాజుపేట ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో 8,9,10 తరగతుల పిల్లలకు కేరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో చదువుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. సర్పంచ్ భీమిశెట్టి లక్ష్మణరావు,ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్,పంచాయతీ రాజ్ విశ్రాంత ఈఈ భీమిశెట్టి గణేశ్వరరావు,విశాఖ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కెమికల్ డిపార్ట్‌మెంట్ హెడ్ భీమిశెట్టి లక్ష్మణరావు, హైస్కూల్ హెచ్ఎం జి.అప్పారావు,పీఎంసీ చైర్మన్ కర్రి కృష్ణ,తోసా అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటప్పారావు,కమిటీ సభ్యులు దివాకర్,శివాజీ, శ్రీ మన్నారాయణ పాల్గొన్నారు. అనంతరం ఇటీవల జరిగిన పదవతరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

మధ్యాహ్న భోజన పథకం తనిఖీ



కాగితలో మధ్యాహ్నభోజన పథకం అమలును పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

నక్కపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా కాగిత పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. అక్కడ భోజన పథకాన్ని తనిఖీ చేసి, స్టోరేజీ పాయింట్ పరిశీలించారు. అనంతరం చినదొడ్డిగల్లు పాఠశాలను సందర్శించారు. వంటకాలను రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంఈవో కుంచం నరేష్ ఉన్నారు.

ఈ-పంట నమోదుపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకులు డాక్టర్ రామారావు

మునగపాక: ఈ -పంట నమోదుపై రైతులు దృష్టి సారించేలా అవగాహన కల్పించాలని అనకాపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు డాక్టర్ రామారావు సూచించారు. స్థానిక ఆర్‌బీకేలో శుక్రవారం వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో ఈ-పంట నమోదు వేగవంతమయ్యేలా చూడాలన్నారు. ఈ సీజన్‌కు అవసరమయ్యే ఎరువులు,విత్తనాలు అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. అధికారుల సలహాలు, సూచనలు పాటించడం ద్వారా వ్యవసాయంలో మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, ఏఈవో లక్ష్మీశ్రీ, వీఏఏ రవిరాజ్, రైతుసంఘ అధ్యక్షులు ఆడారి మహేష్ పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో చురుగ్గా సీసీ రోడ్లు

కశింకోట: ఎంపీ బీవీ సత్యవతి కేటాయించిన రూ.35 లక్షల ఎంపీ నిధులతో స్థానిక హౌసింగ్ కాలనీలో చేపట్టిన సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనుల్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఎంపీ నిధుల మేరకు నిర్మాణ పనులు పూర్తి చేసి, మిగిలిన రోడ్లను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కేటాయించే నిధులతో పూర్తి చేయనున్నట్లు మీడియాకు ఎంపీపీ తెలిపారు. పనుల్లో వేగవంతానికి కాంక్రీట్ మిక్సర్ వినియోగించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

జలమే జీవనాధారం



నూకరాజును సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

అనకాపల్లిటౌన్: ప్రకృతిలో జీవరాసులన్నింటికీ నీరే ఆధారమని, అలాంటి నీటిని పొదుపుగా వాడుకోవాలని ఏఎంఏఎల్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ శరగడం నూకరాజు సూచించారు. గాంధీనగరం లయన్స్ క్లబ్ ఆవరణలో శుక్రవారం జలమే జీవనాధారం అంశంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నీరు లేనిదే భూమిపై జీవం ఉనికి ఉండదన్నారు. మానవ శరీరంలో ప్రతి అవయవం పనిచేయాలంటే రోజుకు కనీసం 3 నుంచి 4 లీటర్ల నీరు రోజూ తాగాలన్నారు. అంతకు ముందు ఆయనకు అభినందన సత్కారం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఉప్పల వెంకటరాజు, సభ్యులు రత్నాజీరావు, శంకరరావు, మైఖేల్, ఈశ్వరరావు పాల్గొన్నారు.